క్లుప్తంగా

భక్తుల దాహార్తి తీర్చిన చలివేంద్రాలు



చింతలూరులోని గోశాల–గోపరంధామం వద్ద చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆలమూరు: చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి తీర్థోత్సవాలను పురస్కరించుకుని ఉగాది పర్వదినాన దాతలు మంగళవారం విరివిగా ఏర్పాటు చేసిన చలివేంద్రాలు భక్తుల దాహార్తిని తీర్చాయి. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద గోశాల–గోపరంధామం కమిటీ పర్యవేక్షణలో ప్రముఖ పారిశ్రామిక వేత్త వనుం సత్యనారాయణ (అన్నవరం) మజ్జిగ చలివేంద్రాకి ఆర్థిక తోడ్పాటు అందించారు. కొత్తూరు సెంటర్‌లో బాలాజీ స్టీల్స్, కల వచర్ల యూత్, చింతలూరులో గౌడ యూత్, విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాల్లో మజ్జిగ, బెల్లపు పానకం, మంచినీటిని అందించడంతో పాటు పులిహోర పొట్లాలు పంపిణీ చేశారు. అలాగే సంధిపూడికి చెందిన కోదండరామ సేవా సమితి, పినపళ్లలో శెట్టిబలిజ యూత్ ఈ చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. వేసవిలో చల్లని పానీయాలు అందించి దాహార్తి తీర్చిన దాతలను భక్తులను అభినందించారు.

నవమి ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం



పి.గన్నవరం సెంటర్లో శ్రీరామనవమి ఉత్సవాలకు పందిరిరాట ముహూర్తం చేస్తున్న దృశ్యం

పి.గన్నవరం: ఈనెల 17 నుంచి పి.గన్నవరంలో సీతారామ వర్తక సంఘం ఆధ్వర్యంలో జరగనున్న శ్రీరామ నవమి ఉత్సవాలకు మంగళవారం పందిరిరాట ముహూర్తం చేశారు. స్థానిక మూడు రోడ్ల సెంటర్లో పురోహితులు మిర్తిపాటి సూరిబాబు ఆధ్వర్యంలో బలబద్ర మోహనరావు పూజలు చేశారు. వర్తక సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు తెలగారెడ్డి అగ్ని సుబ్బారావు, దొమ్మేటి వెంకటేశ్వరరావు, సభ్యులు రాలింగి కోటేశ్వరరావు, నల్లా పెదకాపు, గిడుగు బాబ్జీ, తమ్మన ప్రసాద్, యడ్లపల్లి రాము, షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు



అంబాజీపేటలో బీజేపీ సమావేశంలో మాట్లాడుతున్న సూర్యారావు

అంబాజీపేట: ఉమ్మడి పొత్తులో భాగంగా నియోజకవర్గంలోని బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఉమ్మడి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ సాక్షిగా బీజేపీ కార్యకర్తలు బహిరంగంగా విమర్శించారు. అంబాజీపేటలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన బీజేపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆ సమావేశంలో ప్రస్తుత ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి పొత్తులో ధర్మాన్ని పాటిస్తూ స్థానిక నియోజకవర్గంలో కార్యకర్తలకు అన్ని విషయాల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పొత్తు ఏర్పడిన నాటి నుంచి తమకు ఏనాడు ప్రాధాన్యం ఇవ్వకుండా అవమానిస్తున్నారన్నారు. ఉమ్మడి పొత్తు అని చెప్పుకొని డప్పు కొట్టుకోవడం తప్ప ఏ మాత్రం కార్యకర్తలను పట్టించుకోవడం లేదని, అవమానాలు భరిస్తూ వారి వెంట ఉండలేక సతమతమవుతున్నామని పలువురు ఆరోపిస్తున్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల వెంకటరామ్మోహనరావు, జాతీయ నాయకులు పురిగళ్ల రఘురాం, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

మామిడికుదురు: ఎస్టీయూ మామిడికుదురు మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో మండల శాఖ అధ్యక్షుడు కారుపల్లి కల్యాణ్‌బాబు సారథ్యంలో ముస్లిం ఉపాధ్యాయులకు సోమవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నాగిరెడ్డి శివప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చొప్పల రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు పాల్గొన్నారు.

ఏవీఎస్ మాస్టారుకు సత్కారం

ముమ్మిడివరం: ముమ్మిడివరం కళా సాహితీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రవీంద్ర విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పదవీ విరమణ చేసిన ఏవీఎస్ మాస్టారును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్.అబ్బులు, బీవీవీ ప్రసాదరావు, అరిగెల నాగేశ్వరరావు కవితా గానం చేశారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి



వేంకటేశ్వర స్వామి ఆలయంలో పంచాంగ పఠనం నిర్వహిస్తున్న దృశ్యం



అప్పనపల్లిలో ఉగాది వేడుకల్లో భాగంగా పంచాంగ పఠనం



పి.గన్నవరంలో ఉగాది సందర్భంగా పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి



గొల్లపల్లిని సత్కరిస్తున్న చాంబర్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్

వైభవంగా క్రోధి వేడుకలు

- ఇంటింటా ఉగాది పచ్చడి, పిండి వంటల ఘుమఘుమలు
- పంచాంగ పఠనాలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పండిత సత్కారం

కొత్తపేట: శ్రీక్రోధి నామ సంవత్సరం అందరికీ ఆయురారోగ్య ఐశ్వర్యాలు, ఆనందోత్సాహాలు పంచాలని వేదపండితులు, పంచాంగ కర్తలు ఆకాంక్షించారు. ఉగాది పర్వదినాన్ని గ్రామ గ్రామాన ప్రజలందరూ ఘనంగా జరుపుకొన్నారు. దాదాపు ప్రతి ఇంటా షడ్రుచుల ఉగాది పచ్చడిని తయారుచేసి సేవించారు. పిండి వంటలు ఘుమఘుమలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారి దేవస్థానం ఈఓ, అండ్ ఏసీ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఉగాది వేడులు, పంచాంగ శ్రవణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి, వేదపండితులు పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం దేవస్థానానికి సంబంధించి ఈఓ విజయలక్ష్మి నూతన ఆర్థిక సంవత్సరం పుస్తకాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులకు సత్కారం చేశారు.

అప్పనపల్లిలో ఘనంగా ఉగాది వేడుకలు

మామిడికుదురు: క్రోధి నామ నామ సంవత్సరం ఉగాది అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి గ్రంధి మాధవి ఆకాంక్షించారు. అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి దేవస్థానంలో మంగళవారం ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పంచాంగ పఠనం జరిగింది. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, భోగ భాగ్యాలు, సిరి సంపదలతో తుల తూగాలని వేద పండితులు అభిలాషించారు. వేద పండితులు పంచాంగంలోని విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా భక్తులకు ఉగాది పచ్చడిని పంచారు. పంచాంగ శ్రవణం అనంతరం భక్తులకు విసనకర్రలు, పంచాంగాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

అలరించిన పంచాంగ పఠనాలు

రావులపాలెం: షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది వేడుకలను రావులపాలెం మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. యుగం ప్రారంభమయిన రోజు ఉగాది కావడంతో పలు గ్రామాల్లో పంచాంగ శ్రవణం, గ్రామ దేవత ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. తీపి, వగరు, పులుపు, చేదు, కారం, లవణంతో కూడిన ఉగాది పచ్చడిని గృహిణులు తయారు చేసి పిల్లా పాపలకు పంచడంతో పాటు అందరికి శుభం జరగాలని కోరుతూ బంధుమిత్రులకు పంచారు. శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా మండలంలోని వివిధ ఆలయాల్లో పంచాంగ పఠనం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రావులపాలెంలోని వేంకటేశ్వరస్వామి, సీతారామచంద్ర స్వామి, షిరిడిసాయిబాబా ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో మధుర వాచస్పతి వెలివెల జ్వాల సుబ్రహ్మణ్య శర్మ వేద పఠనం నిర్వహించగా వేదపండితులతో వేదస్వస్తి కార్యక్రమం నిర్వహించారు.

సీఆర్‌సీలో పంచాంగ పఠనం

స్వచ్ఛందసేవా సంస్థ కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్(సీఆర్‌సీ)లో గోపాలపురం వాస్తవ్యులు శివకోటి శంకరశర్మ సిద్ధాంతితో పంచాంగ పఠనం, వేద పండిత సత్కారం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: తెలుగు వారికి ప్రీతిపాత్రమైన ఉగాది పండగను మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచి పలు దేవాలయాలు కిటకిటలాడాయి. మహిళలు తమ ఆరాధ్య గ్రామ దేవతలను దర్శించుకుని చలివిడి పానకాలు సమర్పించుకున్నారు. పలు గ్రామాల్లోని ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. పలు చోట్ల పంచాంగ పఠనం నిర్వహించారు. పలు వ్యాపార సంస్థల్లో నూతన దస్త్రాలను ప్రారంభించారు. పలు దేవాలయాల్లో ఉగాది పచ్చడిని భక్తులకు అందించారు.

వాడపల్లిలో..

ఆత్రేయపురం: శ్రీక్రోధి నామ సంవత్సరం ఉగాది పురస్కరించుకుని మంగళవారం ప్రసిద్ధ ఆలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి. వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉగాది పర్వదినం పురస్కరించుకుని రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామి వారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడి భక్తులకు పంచారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన పంచాంగ పఠనాన్ని ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు వివరించారు. ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండి రైతులకు మేలు చేకూర్చుతుందని, వర్షాలు కురిసి సాగునీటి ఎద్దడి ఉండదని వివరించారు. అలాగే మండలంలోని ర్యాలి, ఆత్రేయపురం, కట్టుంగ తదితర గ్రామాల్లో పంచాంగ పఠనం నిర్వహించారు.

నూకాంబికను దర్శించుకున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తడంతో ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులతో పాటు వివిధ రాజకీయ పార్టీలు, అధికారులు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేయడంతో తీర్థంలో సందడి నెలకొంది. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తమ చిన్నారులకు మొక్కులు తీర్చుకుని వారకల్లు, తుళ్లబిళ్ల దిష్టి తీయించి కావిడి కోళ్లు, గండదీపాలను అమ్మవారికి కానుకలుగా సమర్పించారు. భక్తుల తాకిడి విపరీతంగా పెరగడంతో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు రావులపాలెం ఎం.రామ్‌కుమార్,, ఎస్సై ఎల్.శ్రీనునాయక్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. అలాగే పోలెసారె కార్యక్రమంలో భాగంగా భక్తులు వేలాది బూరెలను బిందెలతో తెచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.



చింతలూరులో నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలి: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి

పి.గన్నవరం: క్రోధి నామ సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆకాంక్షించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విప్పర్తి ఆధ్వర్యంలో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పంచాంగ శ్రవణం చేశారు. పండితులను సత్కరించారు. విప్పర్తి మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో పంటలు బాగా పండి రైతులు ఆర్థికంగా బలపడాలని, అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందాలని అన్నారు. కొత్త సంవత్సరంలో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని స్థాపిస్తున్నామని అన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు మరింత సుపరిపాలన అందిస్తారని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటుబడుతున్న జగన్‌ను ప్రజలంతా ఆశీర్వదించాలని విప్పర్తి కోరారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు ఈసందర్భంగా విప్పర్తికి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.


గొల్లపల్లిని సత్కరించిన ఆర్యవైశ్యులు

రాజోలు: క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మంగళవారం రాజోలులో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాసవి ఆర్య వైశ్య కల్యాణ మండపంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధి రాజా రత్నకుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పంచాగ శ్రవణం నిర్వహించారు. రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘ నాయకులు గొల్లపల్లిని ఘనంగా సత్కరించారు. అలాగే రాజోలు శివాలయంలో పంచాగం పఠనం, వేదస్వస్తి అర్చకస్వాములు నిర్వహించారు.

తూతూ మంత్రంగా వాడపల్లిలో ఉగాది



తూతూ మంత్రంగా స్వామి వారి అలంకరణ



గత ఏడాది స్వామి అలంకరణ (ఫైల్)

- ఆలయంలో కనిపించని పండుగ వాతావరణం
- బడ్జెట్ లేదని అధికారుల దాటవేత ధోరణి

ఆత్రేయపురం: అచ్చమైన తెలుగింటి సంప్రదాయాల పండుగ ఉగాది. తెలుగు సంవత్సరం ప్రారంభమైన రోజు. తెలుగువారు గొప్పగా చెప్పుకునే పండగ. అలాంటి పర్వదినాన ప్రతి దేవాలయం కళకళలాడుతూ... భక్తులకు కనుల పండువగా విరాజిల్లుతూ ఉంటాయి. కానీ ఎంతో ప్రతిష్ఠాత్మకమైన కోనసీమ తిరుమలగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో మాత్రం అధికారులు తూతూ మంత్రంగా ఉత్సవాలు జరిపినట్లు తెలుస్తోంది. గత ఏడాది ఎంతో వైభవంగా స్వామి వారిని అలంకరించి దేవాలయ ఆవరణ అంతా పండుగ వాతావరణం అలుముకుంది. కానీ ఈ ఏడాది మాత్రం బడ్జెట్ లేదని సాకుతో స్వామి వారి అలంకరణ కూడా అంతంత మాత్రమే చేపట్టారు. దీనిపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్యధిక ఆదాయం కలిగిన స్వామి వారి క్షేత్రంలో ఉగాది తూతూ మంత్రంగా జరపడం పలు అపోహలకు తావిస్తోంది. ఆలయ సిబ్బంది సైతం చేతి వాటం చూపుతున్నారని దాంతో వాడపల్లి క్షేత్ర ప్రతిష్ట దెబ్బతింటుందని పలువురు ఆరోపిస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు దృష్టి సారించి గతంలో మాదిరిగా ఆలయ ప్రతిష్టను పునరుద్ధరించాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న వైఎస్సార్ సీపీ బైక్ ర్యాలీ



జొన్నాడ నుంచి చింతలూరు వరకూ ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని బైక్ ర్యాలీగా తీసుకువస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఆలమూరు: శ్రీకోధి నామ సంవత్సరం ప్రజల జీవితాల్లో కోటి కాంతులు నింపాలని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఈఏడాది జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ సీఎం జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ అత్యధిక మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగిస్తామని ఆయన ఉగాది పర్వదినాన ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేసిన ఆయనకు గ్రామ వైఎస్సార్ సీపీ నేతలు నామాల శ్రీనివాసు, మార్గని కరుణ, నేలపూడి రత్నకుమారి, నూకపెయ్యి సూరిబాబు నేతృత్వంలో స్థానిక మెయిన్‌రోడ్డులోని జంక్షన్ వద్ద మంగళవారం ఘన స్వాగతం లభించింది. ఈసందర్భంగా ఉగాదిని పురస్కరించుకుని గ్రామంలో స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఏర్పాటు చేసిన పలు ఆధ్యాత్మిక, సేవా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ఆవరణలో రూ.1.6 కోట్లతో చేపట్టిన ఆలయ అభివృద్ధి పనుల ప్రగతిని స్థానిక నేతలను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేకచర్యలు తీసుకోవాలని దేవదాయశాఖకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి విజ్ఞప్తి చేశారు. తొలుత మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ తమ్మన శ్రీనివాసు నేతృత్వంలో పార్టీ శ్రేణులు జొన్నాడ నుంచి చింతలూరు వరకూ నిర్వహించిన బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి స్వయంగా బైక్ నడుపుతూ ఆలయానికి చేరుకున్నారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ మోరంపూడి వాసు, ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణరెడ్డి, నాంద్ర నాగమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఆర్‌సీ చలివేంద్రం ప్రారంభం

రావులపాలెం: జాతీయ రహదారి చెంతన పోలీస్టేషన్ సమీపంలో సీఆర్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సినీ దర్శకుడు వంశీలు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, సినీ నటులు కోట శంకరరావు, సీఆర్‌సీ రూపశిల్పి విక్టరీ వెంకటరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవ దృక్పథంతో సీఆర్‌సీ 24 ఏళ్లుగా నిర్వహిస్తున్న చలివేంద్రం ద్వారా ఎందరో బాటసారులకు దాహార్తి తీరుతుందన్నారు. ప్రతిరోజు ఒకరు వంతున సీఆర్‌సీ సభ్యులు మజ్జిగ చలివేంద్ర నిర్వహణకు ముందుకు రావడం వారిలో ఉన్న సేవా దృక్పథాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, సీఆర్‌సీ సెక్రటరీ కర్రి అశోక్‌రెడ్డి, సేవా విభాగం డైరెక్టర్ కె.సూర్య, ఉపాధ్యక్షుడు చిన్నం తేజారెడ్డి, డైరెక్టర్లు మల్లిడి ఆంజనేయరెడ్డి, సీహెచ్ గోపాలకృష్ణ, నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, చిర్ల కనికిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెంలో సీఆర్‌సీ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సినీదర్శకుడు వంశీ, జగ్గిరెడ్డి, కోట శంకరరావు తదితరులు

చంద్రబాబు మాటలను నమ్మే పరిస్థితి లేదు

వైఎస్సార్ సీపీ రాజోలు అభ్యర్థి గొల్లపల్లి

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనాన్ని తట్టుకునే దమ్ము, ధైర్యం టీడీపీ అధినేత చంద్రబాబుకు లేదని రాజోలు అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. మామిడికుదురులో గొల్లపల్లి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు గొల్లపల్లికి హారతులిస్తూ బ్రహ్మరథం పట్టారు. వలంటీర్లను ఉగ్రవాదులతో పోల్చిన చంద్రబాబు వలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తామని నోటికొచ్చినట్లు ఇన్నాళ్లూ వలంటీర్లను ఆడి పోసుకుని వారిపై ఇప్పుడు ఎక్కడ లేని ప్రేమ చూపిస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. ×నువ్వు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోయే వాళ్లు ఇక్కడ ఎవ్వరూ లేరన్న విషయం గుర్తు పెట్టుకోవాలి చంద్రబాబు× అని గొల్లపల్లి మండిపడ్డారు. అసెంబ్లీతో పాటు పార్లమెంటుకు జరుగుతున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాను గుర్తుకు వేసి వైఎస్సార్ సీపీ విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య, పార్టీ నాయకులు కంచి శ్రీరామ్, నయినాల రామకృష్ణ, వర్ధినేని రాము, నయినాల సత్యమూర్తి, నయినాల శివ, గెద్దం రాంబాబు, రాయుడు నాగేశ్వరరావు, మొల్లేటి సత్యనారాయణ, అల్లు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



మామిడికుదురు ప్రచారంలో పాల్గొన్న గొల్లపల్లికి హారతి ఇస్తున్న మహిళలు

వైభవంగా అమ్మవార్ల జాతరలు

కొత్తపేట: స్థానిక కమ్మిరెడ్డిపాలెం గ్రామ దేవత తాళ్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మిద్దే సత్యనారాయణ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని పలివెల గ్రామ దేవత తాళ్లమ్మ తల్లి అమ్మవారికి ఉగాది సందర్భంగా భక్తులు అత్యధిక సంఖ్యలో వివిధ రూపాల్లో మొక్కులు తీర్చుకున్నారు. మంగళ, బుధ, గురువారాల్లో జాతర, ఉయ్యాల, తీర్థ మహోత్సవాలకు ఆలయ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

గరగాలమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడు గ్రామ దేవత గరగాలమ్మను, పక్కనే వేంచేసిన దుర్గమ్మను కుటుంబసమేతంగా ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి, నియోజకవర్గ ప్రజలందరిపై అమ్మవారి కరుణా కటాక్షలు ఉండాలని ఆకాంక్షించారు.

నగరంలో..

మామిడికుదురు: నగరం గ్రామదేవత దొడ్డి గంగాలమ్మ జాతర సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, తీన్‌మార్ విన్యాసాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ జాతర ఆద్యంతం కనుల పండువలా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు జాతరలో పాల్గొన్నారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పలు రకాల బెంగళూరు పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మంగళవారం అమ్మవారికి భక్తులు నైవేద్యాలు చెల్లించారు. జాతర సందర్భంగా ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అంబాజీపేట: ఉగాది రోజున ఏటా నిర్వహించే కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వనువులమ్మ జాతర మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం మాచవరం ఇటికాలమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయం వద్ద నుంచి అమ్మవారి పసిడి కుండలను సుందరంగా అలంకరించిన పూజఘటాలను నెలకొల్పి మేళతాళాలు, బాణసంచా, యువకుల కేరింతల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయం వద్ద అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు తీర్చుకున్నారు. గ్రామానికి చెందిన ఆడపడుచులంతా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి పూజాఘటాలు, జాతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా సెంటర్‌లో పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు.



అంబాజీపేటలో ఊరేగింపుగా తీసుకువస్తున్న వనువులమ్మ వారి పూజఘటాలు



ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



కొత్తపేట కమ్మిరెడ్డిపాలెం గ్రామ దేవత తాళ్లమ్మను దర్శించుకుంటున్న భక్తులు



నగరం గ్రామ దేవత దొడ్డి గంగాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఉగాది పర్వదినాన ఉత్సవాలు మొదలు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిపాలెం సెంటర్లో కొలువై ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు మంగళవారం ఉగాది పర్వదినాన ఘనంగా మొదలైనవి. ఈ నెల 13వ తేదీ వరకూ ఉత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దంతులూరి శ్రీనివాసరాజు, వసుధ ఫౌండేషన్ నియోజకవర్గ చైర్మన్ జంపన బుజ్జిరాజు, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, ఆరిపల్లి సత్యనారాయణ పూజలు నిర్వహించారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి ఉగాది రోజున అమ్మవారిని దర్శించుకుని, అరటిపళ్లు, కొబ్బరి కాయలు నైవేద్యాలుగా చెల్లించుకున్నారు.

రావులపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ఉగాదిని పురస్కరించుకుని అమ్మవార్ల జాతరల్లో భాగంగా మంగళవారం ఘనంగా గ్రామోత్సవాలు నిర్వహించారు. ఊబలంక కోటసత్తెమ్మ అమ్మవారి జాతరను సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బుట్టబొమ్మలు, విచిత్ర వేషధారణలు, గరగనృత్యాలు, కోలాట ప్రదర్శనలతో అమ్మవారికి గ్రామోత్సం నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. అలాగే కొమరాజులంకలో లంకాలమ్మ, రావులపాడులో ఆదిలక్ష్మీమ్మ, పాటమ్మ, ముమ్మిడివరప్పాడులో గరగాలమ్మ గ్రామోత్సవాలు నిర్వహించారు.

ఘనంగా ముసలమ్మ తల్లి తీర్థం

పి.గన్నవరం: రాజులపాలెంలో వేంచేసిన ముసలమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం వైభవంగా జరిగింది. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమాలకు ఆలయ కమిటీ నాయకులు ఆధ్వర్యం వహించారు.